ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 | సంచిక : 1 | సెప్టెంబర్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

31-07-2015
భీమవరం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (రామకృష్ణగారి ప్రవచనము, భీమవరం 31-07-2015)

పరమేశ్వర స్వరూపులైన నాన్నగార్కి, ఈ సమావేశానికి విచ్చేసిన అశేషప్రజానీకానికి నా హృదయపూర్వక నమస్కారములు.

ఈ రోజు గురుపూర్ణిమ పుణ్యదినోత్సవం. శ్రీమన్నారాయణుడు దగ్గరనుండి నాన్నగారి వరకు ఉన్నటువంటి గురుపరంపర అందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. గురుతత్వం ఏమిటి? గురువు ప్రాధాన్యత ఏమిటి? జీవితంలో, అని నేను తెలుసుకొన్నది సరిగ్గా 21 సంవత్సరాల క్రితం ఈ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన కొత్తలో సద్గురువు నాన్నగారి యొక్క దర్శనభాగ్యం నాకు కలిగింది. రమణమహర్షి యొక్క సిద్ధాంతసారాన్నంతా సామాన్యులకు అర్థమయ్యే భాషలో చెప్పి ఎంతమందినో పునీతులను చేసిన మహామనిషి సద్గురువు నాన్నగారు. ఇప్పుడు వారి దర్శనం ఇప్పిస్తాము అని చెప్పారు. ఋషిరూపంలో కౌపీన జటాధారులన్నీ ఉన్నటువంటి రూపంలో వారు కనిపిస్తారు అనుకొన్నాను కానీ చూస్తే ఎప్పుడో గతించినటువంటి మా నాన్నగారు నా మీద చూపించేటువంటి ఆర్ద్రతాభావం ఎలా ఉంటుందో ఆ ఆర్ద్రతాభావంతోటి, చిరునవ్వుతోటి నాన్నగారిని చూడటం జరిగింది. అంటే గురుస్వభావం ఎలా ఉంటుంది అన్నదానిమీద మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి. గురువు ఒక ప్రత్యేకమైన వేషంతోటి, ఒక ప్రత్యేకమైన రూపంతోటి వస్తారు అనేటువంటి అపోహ భక్తులకు పనికిరాదు. గురురూపం ఎలాగైనా ఉండవచ్చు. అందుకే దత్తాత్రేయులవారు గురువు 24 రూపాలలో నాకు కనిపించారు అని చెప్పారు. అందుచేత స్వస్వరూప అనుసంధానం కోసం, మన స్వరూపం మనకు బోధించడానికి వచ్చేటువంటి గురువు యొక్క తత్వం సరిగా అర్థం చేసుకొన్నప్పుడు ఆ గురుబోధనలను, గురువు యొక్క

ప్రవర్తనని, గురువుయొక్క సామీప్యాన్ని సమంగా అర్థం చేసుకోగల అవకాశం మనకు వస్తుంది.

గురువులు సాధారణంగా శిష్యులకు దీక్షలు ఇచ్చే విధానాలు శాస్త్రీయంగా మూడు పద్ధతులు అని చెపుతారు. మత్స్యదీక్ష, కుక్కుటిదీక్ష, మకటదీక్ష. చేప గుడ్లు పెట్టినప్పడు ఆ గుడ్లను పొదగడానికి దోహదకారిగ వాటిని చూస్తు వెళుతుంది. కేవలం చూడటం వలన ఆ గుడ్లు పొదిగి చేపపిల్లలుగా తయారవుతాయి. తాబేలు ఏమి చేస్తుంది అంటే ఒడ్డుకు వచ్చి యిసుక తవ్వి అందులో గుడ్లు పెట్టి వెళ్లిపోతుంది. కాని తాను పెట్టినగుడ్లు పొదగాలని, ఆరోగ్యంగా ఎదగాలని మనస్సులో నిత్యం ఆలోచిస్తూ ఉంటుంది. అంటే నేత్రదృష్టి లేదుకాని ఆలోచనాదృష్టి ఉంది, ఆ గుడ్లను మనస్సులో పెట్టుకొంది. కుక్కుటిదీక్ష అంటే కోడి గుడ్లు పెట్టిన తరువాత వాటి మీద కూర్చుని, వాటిని స్పర్శించి పొదుగుతుంది. గురువులు ఈ మూడు రకాల దీక్షలు ఇస్తూ ఉంటారు. ఎవరికి ఏ దీక్ష ఇస్తారు? ఒకరోజు మనం గురువు దగ్గరకు వెళతాము. మనలను పలకరించి అందరికంటే ముందుగా కుర్చీవేసి కూర్చోబెడతారు. అప్పడు మన మనస్సులో నేను గురువుకు ప్రాధానీకుడిని మిగతా శిష్యులు అంతా సెకండరీ అని బయలుదేరుతుంది. గురువుకు నేను ప్రాధానీకుడిని అనే అభిప్రాయమే అహంకారం. గురువుకు అందరూ సమానమే. అయితే దేనిమీద ఆధారపడి ఈ దీక్షలు ఇస్తారు అంటే మన అహంకారం యొక్క స్వరూపాలు ఎలా మారుతున్నాయో దానినిబట్టి వారు ఇస్తారు. ఒకోసారి మనం అంటాము ఎప్పడూ మనం కనబడగానే ప్రీతిగా మాట్లాడే గురువుగారు ఈరోజు అసలు మాట్లాడనేలేదు ప్రక్కన ఎవరితోనో మాట్లాడారు అంటాము. అంటే గురువు యొక్క స్వరూపాన్ని అర్థం చేసుకోక ఈ రకమైన అనుమానాలు మనకు వస్తూ ఉంటాయి. జిన్నూరు నాన్నగారిలాంటి గురువుగారు నేను చూసినటువంటి గురుతత్వంలో చాలా అరుదుగా కనిపించేటువంటి వ్యక్తి. 1994వ సంవత్సరంలో నాకు పరిచయం అయిన తరువాత ఇప్పడు 2015 అంటే ఈ 21 సంవత్సరాల నుండి వారు నన్ను ప్రభావితం చేస్తున్నారు. నేను చూసింది ఏడాదికో, రెండేళ్లకో ఒకసారి వచ్చి వారి పాదస్పర్శతీసుకొని వెళతాను. కాని వారు నిరంతరం లోపలఉండి ఎప్పటికప్పడు నాకు ప్రబోధిస్తూ, అనేక క్లిష్టమైన సమస్యలు పరిష్కారం లేకుండా ఉన్నప్పడు నాకు వాటికి సులభమైన పరిష్కారాలు తోపించి ఎప్పటికప్పడు నన్ను నడిపిస్తున్నారు. ఇది గురుతత్వం యొక్క ప్రధానమైన అంశం. గురువు మనకు కనబడినప్పడు మనతో ఎలా ఉన్నారు అనేది కాకుండా మన మనస్సులను ప్రభావితం చేసే విధానం మనకు తెలిసిపోతుంది. గురుకృప అంటే అది. వారు నిత్యం మనకు సన్నిహితంగా ఉండకపోయినా ఒకసారి మనతో మాట్లాడారు అంటే, ఒకసారి వారి చూపు మనమీద పడింది అంటే చాలు. ఒకసారి

హైదరాబాద్‌లో ఒక మీటింగులో నాన్నగారు ఏమన్నారు అంటే రామకృష్ణగారికి ఒక దండవేయండి అన్నారు.  అంటే నేను అన్నాను స్వామీ మీచూపు వెయ్యిదండల సాటి వస్తుంది చూపు చాలు కదా, ఇంక దండ ఎందుకు అన్నాను.  వారి అనుగ్రహం, ఆర్ధ్రత, వారిచూపు చాలు.  అయితే కొన్ని అనుభవాలు కూడా ఉన్నాయి.  మనం నిత్యజీవితంలో చూసే అనేక సమస్యలలో మా మిత్రుడు ఒక ఆయన సైంటిస్టు, కూతురుపెళ్ళి అవ్వటంలేదని వర్రీపడుతూ ఉండేవాడు.  ఒకసారి ఆయన కూడా నాతోపాటు జిన్నూరు వచ్చాడు, నాన్నగారి దర్శనం అయ్యింది, మాట్లాడాము, ఆశీర్వదించారు, వెళ్ళిపోయాము.  ఆయన వెళ్ళేటప్పటికి అనూహ్యంగా మగపెళ్ళివారు ఎదురు చూస్తున్నారు వీళ్ళని వెతుక్కుంటూ, అంతవరకు వారు మాట్లాడుకోలేదు.  తరువాత ఆ మిత్రుడు నాతో చెప్పాడు "ఏమిటి నాన్నగారిలో అపారమైన మహిమ కూడా ఉందా!" అని.  కాని నాన్నగారు మహిమల గురించి ఎప్పుడూ చెప్పలేదు, అది నిజమైనభక్తులకు, నాన్నగారిని మనస్సులో సుప్రతిష్టలను చేసుకొన్న భక్తులకు అనుభవాల రూపంగా గోచరించింది.  ఇది నేను విన్న విషయం, నాకు జరిగిన విషయం.

కేవలం కొన్ని దైహికమైన ఆశీర్వచనాలు ఇస్తేనో లేకపోతే కొన్ని మహిమలు చేస్తేనో గురువు అనే పద్ధతిలో కాకుండా శిష్యులకు తత్త్వాన్ని బోధించాలి, నేనెవరు అనేది వారు తెలుసుకొనేటట్లు చేయాలి.  సామాన్యమైన గృహిణులు కొన్నివేలమంది ప్రభావితమై వారి జీవితాలను ఎంతో సుఖవంతం చేసుకొంటున్నారు అంటే, ఈ రోజున మహాపండితులకు కూడా అర్థకాని తార్కిక విషయాలను అందరకూ సులభంగా అర్థమయ్యే భాషలో నాన్నగారి అమృతవచనాల ద్వారా మనకు అందుతున్నాయి అంటే ఇది మనందరి అదృష్టం.  ఇటువంటి గురువు దొరకటం మనందరి సామూహిక అదృష్టం.  ఈ గురుపూర్ణిమ రోజున శిరస్సు వంచి వారి పాదకమలాలకు నేను హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను.  కాని నమస్కరించటం కొంచెం కష్టం ఎందుచేతనంటే వారి పాదకమలాలు బయటలేవు, గుండెల్లోనే ఉంటే ఎలా నమస్కరిస్తాము?  అంటే నిత్యం మనతోనే ఉన్నారు గురువుగారు. ఇటువంటి గురువుగారి సన్నిధానం దొరికిన నేను ఎంతో అదృష్టవంతుడిని.  అల్లుడనైన నన్ను పిలిచి నువ్వు ముందు మాట్లాడు అంటే ఆదేశమే, గురువు ఆదేశం ఏమి చేస్తాము, మనం మాట్లాడి తీరవలసిందే.  మనకు మాట్లాడే సమర్థత లేకపోయినప్పటికీ, అంత చాతుర్యం, అంత వాక్కు వైభవం లేకపోయినప్పటికి కూడా గురువుగారు చెప్పినప్పడు ఆజ్ఞగా పాటించి మాట్లాడాలి అని, ఈ రెండు మాటలు మాట్లాడటానికి మీ సమక్షంలో ధైర్యం చేసాను.  మీ అందరికి హృదయపూర్వక నమస్కారములు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-07-2015 భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గురుపూర్ణిమ. దీనినే వ్యాసపూర్ణిమ అంటారు అంటే వ్యాసుడి యొక్క జన్మదినం. వ్యాసుడు మహాపండితుడు. ఆయన నారాయణుడి అంశ అని చెపుతారు. ఆయన విశాలమైన హృదయం ఉన్నవాడు. ఆయన అందరు దేవతలకు స్థానం ఇచ్చి ఎవరికి ఇష్టమైన దేవతను వారు పూజ చేసుకోమని పురాణాలు వ్రాసాడు. మీరు మానసికంగా ఎవరికి సన్నిహితంగా ఉంటున్నారో, ఎవరితో అయితే మీ మనస్సు కలుస్తోందో వారిని మీరు గురువుగా స్వీకరించవచ్చు. ఈ వ్యాసపూర్ణిమ రోజున ఎవరి గురువును వారు గౌరవించటం సాంప్రదాయంగా వస్తోంది. మన గురువు ఆధునికదక్షిణామూర్తి శ్రీ రమణమహర్షి. రమణమహర్షిని ఆధునికదక్షిణామూర్తి అంటున్నారు ఏమిటి అని మీరు అడుగవచ్చు. దక్షిణామూర్తి ఆయన శిష్యులకు మాటతో సంబంధం లేకుండా మాటకు, మనస్సుకు అందని దానిని మౌనంద్వారా వారికి అనుభవంలోనికి తీసుకొనివచ్చారు. అంటే సనత్‌కుమారుడు వాళ్ళకే మౌనం ద్వారా బ్రహ్మపదార్థాన్ని వ్యక్తం చేసారు. అయితే భగవాన్ మధ్య మధ్యలో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు తక్కువే. ఇది కలియుగం, డార్క్ ఏజ్, ఈ యుగంలో కొంచెం విలువలు కూడా తక్కువే. కేవలం మౌనం ద్వారానే, ఎక్స్‌ప్రెస్ చేస్తే అర్థం చేసుకోలేరు. అందుచేత ఈ ఆధునిక మహర్షి భగవాన్ అవసరాన్నిబట్టి తక్కువగా మాట్లాడి ప్రపంచం అంతా వ్యాప్తం చేసారు. భగవాన్ చెప్పిన మాటలను మీరు పరిశీలన చేయండి. ఆయన చెప్పిన వాక్యాలు మీకు నచ్చినా, నచ్చకపోయినా అవి నూటికినూరు పాళ్ళు సత్యం. ఆయన కాలాతీతుడు కాని వ్యవహారం కోసం కాలానికి కట్టుబడి ఉన్నారు. పూర్వం యిటువంటి సభలు లేవు. సాంప్రదాయం ఏమిటి అంటే జిజ్ఞాస ఉండి ఎవరైనా వచ్చి అడిగితే, వారు ట్రూత్ సీకర్స్ అయితే వారికి మాత్రమే చెప్పేవారు. కొంతమంది దగ్గర మౌనంగా ఉండేవారు. వీరికి చెపితే అర్థమవుతుంది అనుకొనేవారికి చెప్పేవారు.

ఈ గురుపూర్ణిమ, నా బర్త్‌డే కూడా హైదరాబాద్ సత్యసాయినిగమ్ కళ్యాణ మండపంలో జరిపేవారు. వారు నన్ను ఒక ప్రశ్న అడిగారు. ఏమండీ పీఠాధిపతులు, మినిష్టర్లు అనేకమంది ఇక్కడ మీటింగులు పెట్టారు. ఎప్పుడూ ఈ హాలు నిండలేదు. మీరు వస్తే ఈ హాలు నిండిపోవటమేకాదు, ఇంకా జనం బయట కూడా నుంచున్నారు, ఏమిటి మీలోని విశేషం అని అడిగారు. నాలో ఏమీ విశేషం లేకపోవటమే విశేషం అని చెప్పాను. నాలో

ఏమీ విశేషం లేదన్న సంగతి నాకు తెలుసు, అందుకే ఇంతమంది భక్తులు వస్తున్నారు అని చెప్పాను. చదువు అంటే ఏమిటి? ఆలోచించటం నేర్చుకోవటం, పరిశీలించటం నేర్చుకోవటం, విలువలను గుర్తించటం, భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోవటమే జీవిత లక్ష్యం. అదే చదువు. యజ్ఞం చేసేటప్పుడు ఎవడో ఒక మేకను చంపితే అది వాడు చేసిన పెద్దపొరపాటుగా మాట్లాడుతున్నారు. మరి రోజూ మాంసం తినటానికి ఎన్ని మేకలను, గొర్రెలను చంపుతున్నారు. మరి వాళ్ళ మాట ఏమిటి? ఇది విమర్శించేవాళ్ళు కనబడటం లేదు. ఏదో రూపంలో సమాజంలో ఎంతోకొంత హింస తప్పదు. ఎంత కంట్రోలు చేసినా సమాజంలో యుద్ధాలు వస్తున్నాయి. భారతంలో కృష్ణుడు రాయబారాలు చేసాడు, చాలా ప్రయత్నాలు చేసాడు కాని చివరకు యుద్ధం తప్పలేదు. అందుచేత యజ్ఞంలోనో, యాగంలోనో మేకను బలి చేసారని అదే పద్ధతిగా మొత్తం వేదాలను విమర్శించటం న్యాయంకాదు. అసలు వేదం అంటేనే జ్ఞానం అని అర్థం. బుద్ధుడు కూడా మొత్తం వేదాలను ఖండించలేదు. హింసతో కూడిన యజ్ఞాలను ఖండించాడు.

ఉన్నది చైతన్యమే, అది తప్పించి మిగతాదంతా నీ మనస్సు యొక్క క్రియేషనే అన్నారు భగవాన్. ఈ ప్రపంచం సత్యమా, అసత్యమా అని అడిగితే సత్యం అని చెప్పలేదు, సత్యంలాగ కనిపిస్తోంది అంతే అన్నారు. అంటే సత్యం కాదని చెప్పటం. ఈ మధ్యన ఒక కలెక్టర్‌గారు నాతో ఏమన్నారు అంటే ఏమండీ నాన్నగారు ఆలోచిస్తూ ఉంటే ఇదంతా నిత్యంకాదని తెలుస్తోంది కాని అలా జీవించలేకపోతున్నాము అన్నారు. అలా జీవించటంకోసమే అభ్యాసము, వైరాగ్యము, విచారణ అవసరం. మీరు చెప్పే మాటలు మాకు ఏమీ అర్థమవ్వటంలేదు అని ఒకసారి భగవాన్‌తో అంటే ఏమి చేస్తాము దీనికి మీ అలవాట్లయొక్క వేగం, మీ తలంపుల యొక్క వేగం, మీ వాసనల యొక్క వేగం కారణం. మీ అలవాట్లు, తలంపులు అంత వేగంగా ఉన్నప్పుడు నేను చెప్పిన వాక్యాన్ని అంగీకరించవు. నేను సత్యం చెప్పినా అది అసత్యంగానే మీకు కనిపిస్తుంది. మీరు మంచివాళ్ళేకాని మీకు ఉన్న అలవాట్లు, మీకు ఉన్న వాసనలు, మీ రాంగ్‌తింకింగ్ వీటి ప్రభావం వలన నేను చెప్పిన విషయం మీరు అందుకోవటం కూడా కష్టం అవుతుంది. అందుచేత ఈ జనరేషన్ కాకపోయినా తరువాత జనరేషన్ అయినా అందుకొంటుంది అని ఆయన చెప్పి వదిలేసారు. భగవాన్ ఆయన జీవితంలో ఎప్పుడూ మంచం మీద పడుకోలేదు. సోఫా మీద కూర్చునేవారు, రాత్రిళ్ళు ఊరికే తలకింద చెయ్యి పెట్టుకొనేవారు అంతే. ఆయన నిద్రపోతున్నారేమో అని అనిపించేది కాని పిల్లి తలుపు

దగ్గర చిన్నగా శబ్దం చేసి లోపలకు వస్తే కళ్ళు తెరిచి చూసేవారు. మీరు నిద్రపోతున్నారా అంటే అవును మరి మెలకువగా ఉన్నవారు నిద్రపోతారు కదా. అయితే ఇప్పుడు మీరు మెలకువగా లేరా అంటే నిద్రపోయేవారందరూ మేల్కొంటారు కదా. అంటే నిద్రపోయే వాళ్ళు మేల్కొంటారు, మేల్కొన్న వాళ్ళు నిద్రపోతారు. అంటే ఆయన ఈ జాగ్రదవస్థకీ, స్వప్నావస్థకీ, సుషుప్తి అవస్థకి వీటన్నిటికీ కూడా అతీతం.

మన మనస్సును ఎవడైతే అంతర్ముఖం చేస్తున్నాడో వాడే మనకు గురువు. మన మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే ప్రారబ్ధం ఎంత తీవ్రంగా ఉన్నా మనకు శాంతి కనిపిస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు. పాయసం నోట్లో వేసుకొన్నప్పుడు మీకు ఊసేయాలని అనిపించదు, దానిని ఎంజాయ్ చేస్తారు. నువ్వు ప్రారబ్ధాన్ని అలా అనుభవించ గలిగితే, అంటే ఇష్టంతో అనుభవించగలిగితే తరువాత జన్మకు ఇటువంటి ప్రారబ్ధం రిపీట్ అవ్వదు అని ఆచార్యులవారు చెప్పారు. గురువు అంటే ఏదో గుడిలో రాయిలాగ ఉంటాడు అనుకోకండి. మనలో అంతర్యామిగా ఉన్నవాడే గురువు. రమణమహర్షి అంటే మానవ రూపంలో ఉన్న భగవంతుడు. భగవంతుడే కాళ్ళు, చేతులు తొడుక్కుని ఈ భూమి మీదకు వచ్చాడు. ఆయనే మనలో అంతర్యామిగా ఉన్నాడు. గురువు అంటే ఆ శరీరం కాదు. మీ శరీరం పోతోంది. ఇంక మాకు దిక్కు ఎవరు అని భగవాన్‌తో అంటే ఇప్పుడు శరీరం ఉంది, ఈ శరీరం ఉన్నప్పుడు కూడా శరీరమా మిమ్మల్ని అనుగ్రహించేది? ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తోందో దానికి చావులేదు. అంటే గురువుతో ఉన్న సంబంధం ఆ శరీరం గతించిన వెంటనే సంబంధం పోదు. గురువు చేసేపని అలా కంటిన్యూ అవుతూ ఉంటుంది. గురువు మనలో అంతర్యామిగా ఉండి ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితికి మిమ్మల్ని తీసుకొని వెళ్ళటానికి మనలో ఉన్న ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయి, ఏ కారణం వలన మనం ట్రూత్‌ను రీలైజ్ చేయలేకపోతున్నాము, రీలైజ్ చేయాలనేటువంటి అభిలాష ఎందుకు రావటంలేదు అనేది గమనించి వాటిని తొలగిస్తాడు. జ్ఞానానికి పెట్టుబడి ధనంకాదు, పాండిత్యంకాదు, తెలుసుకోవాలనే కాంక్షే పెట్టుబడి.

ఎవరిని స్మరిస్తూ ఉంటే మీ మనస్సు అంతర్ముఖం అవుతోందో వారిని మీ గురువుగా తీసుకోవచ్చు అని శాస్త్రంలో ఉంది. కాని నేను రమణమహర్షిగారిని గురువుగా తీసుకోలేదు. ఆయనేవచ్చి నన్ను అనుగ్రహించి, ఆయన భక్తుడిగా స్వీకరించారు. భగవంతుడు ఎవరినైతే ఎన్నుకొన్నాడో వాడికే తెలియబడతాడు అని శాస్త్రంలో చెప్పారు. ధనంవల్లకాని, సంతానం వల్లకాని, అధికారంవల్లకాని ఈ బాహ్యప్రక్రియలవల్ల దేని వలన భగవంతుడు తెలియబడడు.

ఒకవేళ మీరు తెలుసుకోవాలన్నా ఆయన తెలియబడడు. ఆయన అనుకోవాలి. ఆయన ఎవడికైతే తెలియబడాలి అనుకొన్నాడో వాడికి మాత్రమే తెలియబడతాడు. నా విషయంలో భగవానే నన్ను ఎన్నుకొన్నారు. అంతకుముందు ఆయన పేరు కూడా ఎప్పడూ నేను వినలేదు. 1959వ సంవత్సరం వరకు భారతదేశంలో ఈ భూమిమీద రమణమహర్షి అనే మహాత్ముడు తిరుగాడాడు అన్న సంగతి కూడా నాకు తెలియదు. ఆయనే నాకు స్వప్న దర్శనం యిచ్చి నన్ను అనుగ్రహించారు. అప్పడు నాలుగు ముద్దులు పెట్టారు. ఆయన రమణమహర్షి అని నాకు తెలియదు. ఆయన కిస్ చేసినప్పడు ఒక మాట అన్నారు. సరిపోతుంది అనలేదు, ప్రస్తుతానికి సరిపోతుంది అన్నారు. ఎవడీ ముసలివాడు, స్వప్నంలోకి వచ్చాడు, చేతిలో కర్ర ఉంది అనుకొని అలా ఉండిపోయాను. రోజూ కాఫీ తాగాక హిందూ పేపరు చూడటం అలవాటు. అలాగ ఒకరోజున పేపరు చూస్తూ ఉంటే అందులో గ్రేట్ మెన్ ఆఫ్ ఇండియా, భారతదేశంలో జన్మించినటువంటి మహాత్ములు అని అందులో పది పేర్లో ఎన్నో ఉన్నాయి. అందులో ఏడో పేరు కింద రమణమహర్షి అనే పేరు ఉంది. ఆయన పేరు దగ్గరకు వచ్చేటప్పటికి తడిబట్టను పిండేసి దులుపుతాము కదా అలాగ దేహం అంతా షేక్ యిచ్చింది. ఇంకాముందు మిగిలిన పేర్లు చదివాను, అప్పడు ఏమీ లేదు. ఈ పేరు దగ్గరకు వచ్చేటప్పటికి శరీరం ఇలా ఊగిపోతోంది ఏమిటి అని ఒక సందేహం వచ్చింది. అందులో కింద ఏమని వ్రాసాడు అంటే ఈ రమణమహర్షిగురించి తెలుసుకోవాలి అంటే సెల్ఫ్ రియలైజేషన్ అనే పుస్తకం చదవండి, అది బి.వి. నర్సింహస్వామిగారు వ్రాసారు, తిరువణ్ణామలై, సౌత్ ఇండియా అని ఉంది. అప్పడు పోస్టు ద్వారా సెల్ఫ్ రియలైజేషన్ పుస్తకం తెప్పించుకొని ఆయన బయోగ్రఫీ మొట్టమొదట చదివాను. నాకు స్వప్నంలో దర్శనం ఇచ్చిన ఆయన, ఈయన ఒక్కడే ఏమీ తేడా లేదు, వాడే వీడు అని ఒక నిశ్చయానికి వచ్చాను. ఆయన పట్ల ప్రేమను నేను ప్రాక్టీసు చేయలేదు. అనుకోకుండా ఆయన పట్ల ప్రేమ, అనురాగం హృదయంలోనుండి చాలావేగంగా వచ్చింది. ఇది ఏ జన్మ అనుబంధమో, ఈనాటి అనుబంధంకాదు, ఇది ఏనాటిదో అని అప్పడు నాకు అనిపించింది.

దుఃఖంలేనిస్థితికి ఎలా తీసుకొని వెళ్ళాలి అనేది బుద్ధుడి టీచింగ్‌లోను, భగవాన్ టీచింగ్‌లోను మనకు కనిపిస్తుంది. ప్రతీ చిన్నవిషయానికి వారు దేవుని గొడవ ఎత్తరు. ఇప్పడు నువ్వు నేను మాట్లాడుకొంటున్నాము. నీకు ఉన్న సందేహాలు ఏమిటో అడుగు. నువ్వు నేను మాట్లాడుకొనేటప్పడు మధ్యలో దేవుని గొడవ ఎందుకు? జీవుడు ఎంత నిజమో, లోకం ఎంత నిజమో, దేవుడు కూడా అంతే నిజం. అంటే అసలు ఈశ్వరుడు లేడు

అని కాదు. దేరీజ్ ఈశ్వర. నువ్వు పరిపూర్ణమైనస్థితిని పొందినప్పుడు అంటే కంప్లీట్‌గా 100% వాసనాక్షయాన్ని నువ్వు చేరుకొన్నప్పుడు నువ్వు ఆనందంగానే ఉంటావు. అప్పుడు దుఃఖం ఎలా ఉంటుందో నీకు తెలియదు. అప్పుడు ప్రపంచంలో ఎవరూ అనుభవించని శాంతి, సుఖం నీకు అనుభవంలోనికి వస్తాయి. అప్పుడు మొత్తం ప్రపంచం అంతా కూడా నీకు ఒక గడ్డిపరక కింద కనిపిస్తుంది. ఆ స్థితిలో అసలు భగవంతుడు ఉన్నాడా లేడా అనే ప్రశ్న నీకు రాదు. నీ శరీరానికి రోగం లేనప్పుడు డాక్టరుతో పనిఏముంది? అలాగే నువ్వు నూటికి నూరుపాళ్ళు ఆనందంగా ఉన్నప్పుడు, ముగింపులేని శాంతిలో ఊగిసలాడుతున్నప్పుడు నీకు అసలు దేవుని గొడవే రాదు.

దేవుడు ఉన్నాడా లేడా అని అడిగితే నువ్వు ఉన్నావా, లేవా అన్నారు. నేను ఉన్నాను అని చెప్పాడు. మరి నువ్వు ఉన్నప్పుడు ఆయన లేకుండా ఎలా పోతాడు, నువ్వెంత నిజమో ఆయనా అంతే నిజం అని చెప్పారు. భగవాన్ చెప్పినమాటలు, ఆచార్యులవారు చెప్పిన మాటలను శారీరకదృష్టి ఉన్నవారు విమర్శిస్తారు, వారు ముసుగు వేసుకొన్న నాస్తికులు అంటారు. వారిమీద నాకు కోపంరాదు, వారిని చూసి నవ్వుకొంటాను, ఆ మాటలు చూస్తే సరదాగా ఉంటుంది. ఎందుచేతనంటే వారికి సబ్జక్టు అందటంలేదు. కృష్ణుడు దేవుడు అంటే ఆ దేహం దేవుడా? ఆ దేహమే దేవుడు అయితే ఇప్పుడు కృష్ణుడి దేహం ఉందా? కబీరు ముస్లిం కుటుంబంలో పుట్టాడు కాని రామనామం చేసేవాడు. గురువు గురించి, శిష్యుడు గురించి కబీరు చాలా బాగా చెప్పాడు. ఈరోజు గురుపూర్ణిమ కాబట్టి ఆయన మాటలు చెప్పకోవాలి. గురువు కుమ్మరి, శిష్యుడు కుండ అని చెప్పాడు. కుమ్మరివాడు మట్టిని కుండ కింద చేస్తాడు. మట్టిని కుండ కింద చేయటానికి లోపలనుండి దెబ్బలు కొడతాడు, బయట నుండి దెబ్బలు కొడతాడు. అలా ఎన్నో దెబ్బలు కొట్టి కొట్టి దానికి కుండ ఆకారం తీసుకొని వస్తాడు. అలాగే గురువు ఏమి చేస్తాడు అంటే భగవదనుభవం పొందకుండా లోపల ఏ బలహీనతలు అయితే మీకు అడ్డువస్తున్నాయో చూసి, వాటిని కెలికి మీ సహస్రారంలోనికి తీసుకొనివస్తాడు. అలా మీలో ఉన్న బలహీనతలను మీకు తెలియజేసి నెమ్మదిగా వాటిని తొలగిస్తాడు. ఆ టైములో మీకు పెయిన్ అనిపిస్తుంది, చాలా కష్టంగా ఉంటుంది. మనకు గురువు అనుగ్రహం లేదేమో ఇన్ని కష్టాలు పడుతున్నాము అని మీకు అనిపిస్తుంది. అంటే మనకు ఏదైనా మంచి జరిగితే గురువు అనుగ్రహం ఉందని, మంచి జరగకపోతే గురువు అనుగ్రహం లేదని అనుకొంటే అసలు మనం భక్తులమే కాదు. ఐ హేవ్ నెవర్ ఎంజాయిడ్ ద వరల్డ్ ఈవెన్ ఇన్ ఎ డ్రీమ్ అన్నాడు రామకృష్ణుడు. ఆ స్థితికి

భక్తుడిని తీసుకొనిపోవటానికి గురువు అన్ని విధాల ప్రయత్నం చేస్తాడు. గురువుమీద మీకు ప్రేమ తగ్గిపోయినా గురువు మిమ్మల్ని ప్రేమించటం మానడు. గురువు అంటే చైతన్యమే, గురువు అంటే బ్రహ్మమే. మీ శరీరాలు మారిపోయినా మిమ్మల్ని వెంటాడుతాడు, తన స్వరూపం మీకు ఇచ్చేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు గురువు. ఇప్పుడు నేను చెప్పిన మాటలను భగవాన్ మాటలలో చెప్పాలి అంటే గురువు అనుగ్రహంలో పడ్డవాడు పులినోట్లోపడ్డ మాంసపు ముక్క అన్నారు. పులినోట్లో పడ్డ మాంసపు ముక్క ఇంక బయటకు రాదు అలాగే గురువు అనుగ్రహంలో పడ్డవాడు రక్షింపబడి తీరతాడు, వాడికి వాసనాక్షయం అయిపోతుంది, వాడు మోక్షాన్ని పొందుతాడు కాని వాడు అందులోనుండి బయటపడే అవకాశం లేదు. మనకు వాసనాక్షయం ముఖ్యం. వాసనాక్షయం అవ్వకుండా గ్లిమ్‌సెస్ ఆఫ్ రీలైజేషన్ ఏదైనా ఉన్నా అది నిలబడదు.

బాహ్యంగా గురువు రూపం ధరించకపోయినా ఆయన మనలో అంతర్యామిగా ఉండి పనిచేస్తూనే ఉంటాడు. విషయచింతననుండి బాహ్యగురువు నీ మనస్సును లోపలకు గెంటుతాడు. నిజమైనగురువు లోపలే ఉంటాడు. అసలు గురువు అంటేనే అనుగ్రహం. గురువు అనుగ్రహం మీ శిరస్సుమీద పడినప్పుడు శరీరాన్ని కొడితే ఆ స్పర్శ మీకు ఎలా తెలుస్తుందో అంత స్పష్టంగా గురువు అనుగ్రహం మన మీద పనిచేస్తోంది అని మీకు తెలుస్తూ ఉంటుంది. దీనికి మీరు గ్రంధాలు ఏమీ చదవనక్కరలేదు. గురువు అనుగ్రహం ఉంటే మీరు కూర్చున్న వాళ్ళు నిలబడకుండా మీరు రీలైజేషన్ పొందుతారు. కొన్నివందల జన్మలు తీసుకొనివచ్చే వాసనలు మీలో ఉన్నా, ఎన్నో జన్మలు అనుభవించవలసిన ప్రారబ్ధం మీకు ఉన్నా సామాన్య మానవుడు తీయలేని ఆ బండరాళ్ళను ఆయన లోపలనుండి వాటిని గెంటి, వాటిని కాల్చి బూడిద చేస్తాడు, వాడు గురువు. గురువే భగవంతుడు, గురువే చైతన్యం, గురువే శాంతి, గురువే ఆనందం. అసలు శరీరం వచ్చింది అంటే అది ఏదో రోజున చనిపోతుంది. రాబోయే జన్మలలో అనుభవించవలసిన ప్రారబ్ధం మీలో ఉన్నా గురువు అనుగ్రహం ఉంటే అదంతా కాలిబూడిద అయిపోతుంది. పెద్దగడ్డిమేటును తగలబెట్టటానికి చిన్న అగ్గిపుల్ల సరిపోతుంది అలాగే మీలో ఎన్ని వాసనలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నా గురువు యొక్క ఒన్ లుక్ ఈజ్ ఎనఫ్, ఒన్ వర్డ్ ఈజ్ ఎనఫ్ అవి అన్నీ కాలిపోతాయి.

చలంగారు నాస్థికుడు. చింతా దీక్షితులుగారు చలంగారు మిత్రులు. చింతా దీక్షితులుగారు భగవాన్ భక్తులు. 1936 సం॥లో చింతాదీక్షితులుగారు చలంగారితో నేను భగవాన్‌ను చూడటానికి వెళుతున్నాను మీరు కూడా వస్తారా అని అడిగారు. సైటిసీయింగ్

కోసం అయితే వస్తాను అన్నారు చలంగారు. ఇద్దరూ కలిసి వెళ్ళారు. భగవాన్ పెద్దవాడు అంటున్నారుకదా మీరు ఆయనకు నమస్కారం పెట్టుకొంటే పెట్టుకోండి, నాకు ఎవరికీ నమస్కారాలు పెట్టే అలవాటు లేదు, నేను పెట్టుకోను అని చలంగారు చెప్పారు. అసలు నమస్కారం అంటే మనస్సు అణిగి ఉండటమే నిజమైన నమస్కారం. అక్కడ నాలుగు రోజులు ఉన్నారు. సరే అందరినీ చూసినట్లే ఆయననీ కూడా చూస్తున్నాడు. భగవాన్ కొండదిగి ఆశ్రమానికి వస్తున్నారు. చింతా దీక్షితులుగారు నమస్కారం పెట్టి నేను వెళ్ళిపోతున్నాను అన్నారు. భగవాన్ సరిసరి అన్నారు. తరువాత భగవాన్ నాలుగు అడుగులు ముందుకు వెళ్ళారు. అప్పుడు చలంగారు వెనకాలే దగ్గరకు వెళ్ళి ఆయనతోపాటు నేను కూడా వెళ్ళిపోతున్నాను అన్నారు. అప్పుడు భగవాన్ వెనక్కి తిరిగి అలా ఒక నిమిషం చలంగారి వంక చూచి వెళ్ళిపోయారు. మాటలు లేవు. అక్కడితోటి చలంగారి పని పూర్తి అయిపోయింది. లోపల చేయవలసిన సర్జరీ చేసేసారు. ఆచూపుతోటి ఆయనకు మారు మనస్సు వచ్చేసింది. చలంగారు ఒకసారి నా దగ్గర చెప్పారు ఈ భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, ఏమిటో నాకు అక్కరలేదు, ఎందుకో నాకు అక్కరలేదు, ఆయన దగ్గర నుండి ఆనందం పొందుతున్నాను. ఆయన ఎవరి అవతారం అయితే నాకు ఎందుకు? ఆయన నాకు ఆనందసముద్రం. ఆయన దగ్గర నుండి డైరెక్టుగా నేనేమి పొందుతున్నానో అది నాకు కావాలి. అరువు బేరాలు వద్దు, అంతా కేష్ బేరమే. ఆయన దగ్గరనుండి నేను శాంతిని పొందుతున్నాను, కాంతిని పొందుతున్నాను. అది చాలు నాకు. మిగిలిన గొడవలు వద్దు అన్నారు చలంగారు.

మనం ఏదో సాధన చేస్తున్నాము, కష్టపడుతున్నాము అనుకొంటాము. మనం ఎంత? మనం చేసే సాధన ఎంత? నేను ఒకసారి జువ్వలపాలెం సూరమ్మగారిని మీరు బాగా సాధన చేసుకొంటున్నారా అని ఫోనులో అడిగాను. ఏదో చేస్తున్నాను, నేను చేసేది ఎంత? వచ్చేది అంతా అక్కడనుండి రావాలి. రావలసినదంతా గురువు వైపునుండే రావాలి కాని మనం చేసేది ఎంత? మన మనస్సు ఎంత వరకు సాధన చెయ్యగలదు? అన్నారు. అదే రామకృష్ణుడి మాటలలో చెప్పాలి అంటే మీరు ఒక అడుగు ముందుకు వేయండి, నేను తొమ్మిది అడుగులు మీకోసం ఎదరికి వస్తాను. అంటే గురువు యొక్క దయ అటువంటిది. మీ సాధన గురువు, మీ జిజ్ఞాస గురువు, మీ జ్ఞానం గురువు, ఇప్పుడు మీరు ఏ స్థాయిలో ఉన్నారో ఆ స్థాయి పొందటానికి గురువు అనుగ్రహమే కారణం, అంతా గురువే. జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడిని అడిగారు. మనం నేను, నేను అంటున్నాము కదా! ఆ నేను,

నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని చెప్పారు. ఎంత అందంగా చెప్పారో చూడండి. ఇక్కడ మనం గ్రహించవలసింది ఏమిటి అంటే వస్తువు చేతిలో ఉంది, వాళ్ళు ఏదైతే చెపుతున్నారో అది అయి ఉండి చెపుతున్నారు. అదే మనకు వారికి తేడా.

రమణమహర్షిగారికి శరీరం ఉంది, మనకూ శరీరం ఉంది. ఆయన నేను అంటున్నారు, మనం నేను అంటున్నాము. అయితే తేడా ఏమిటి అంటే మనం చెప్పే నేను దేహానికి పరిమితమైనది. వారు చెప్పే నేను దేహానికి పరిమితమైనది కాదు. అందుచేత దేహం పోయినప్పుడు మేము పోతున్నాము అని వారు అనుకోరు. అందుచేత జ్ఞాని బర్త్‌లెస్, డెత్‌లెస్. మనం చెప్పే నేను దేహంతో పరిమితమై ఉంది కాబట్టి ఆ దేహం పోయినప్పుడు నేను పోతున్నాను అంటాము. చనిపోయాక ఈ దేహం ఉండదు అని మనం అంటాము. అది ఇప్పుడుకూడా లేదు అంటారు ఎందుచేతనంటే అది ఒక తలంపుమాత్రమే. గాఢనిద్రలో మీకు దేహం గొడవ ఎక్కడుంది, మీకు దేవుడి గొడవ ఎక్కడ ఉంది. ప్రపంచం ఉందా అక్కడ. గాఢనిద్రలో ఏ గొడవ లేదు. మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. ఏనుగు నిద్రలో ఉండగా దానికి సింహం స్వప్నంలోనికి వస్తే వెంటనే మెలకువ వచ్చేస్తుంది. అలాగే మీరు అజ్ఞానమనే నిద్రలోనుండి మేల్కొని జ్ఞానంలోనికి రావటానికి గురువు అనుగ్రహం సింహంలాగ ఉపయోగపడుతుంది. గురువు అనుగ్రహం అంత బలీయమైనది.

సంచితం, ఆగామి, ప్రారబ్ధం అని కర్మని మూడురకాలుగా విభజించారు. మీకు జ్ఞానం కలిగితే సంచితం పోతుంది, ఆగామి పోతుంది, ప్రారబ్దం అనుభవించవలసిందే అని శాస్త్రాలు చెప్పాయి. ప్రారబ్దాన్ని కూడా అనుభవించనక్కరలేదు అని భగవాన్ చెప్పారు. ప్రారబ్దం ఎవరు అనుభవిస్తారు. దేహం అనుభవిస్తుంది. మీకు దేహంతో తాదాప్యం పోయినప్పుడు ఇంక మీకు ప్రారబ్దం ఏమిటి? చైతన్యం ప్రారబ్దం అనుభవిస్తుందా? పుట్టినదానికి ప్రారబ్దం ఉంది కాని పుట్టనిదానికి ప్రారబ్దం ఏమిటి? నీకు దేహాత్మబుద్ధి లేనప్పుడు, ఆత్మబుద్ధి కలిగినప్పుడు ఆత్మకు ప్రారబ్దంలేదు. నువ్వు అదే అయిఉన్నావు. దానికి చావులేదు, పుట్టుకలేదు. దానినే ఆచార్యులవారు సత్యం అని, జ్ఞానం అని, అనంతం అని, బ్రహ్మం అని ఇలా డిఫైన్ చేసారు. ఆచార్యులవారు జ్ఞానగురువు, భగవాన్ జ్ఞానగురువు. మనం జ్ఞానగురువునే ఆశ్రయించాలి, అక్కడ వైభవం ఉంది. భగవాన్ దేహానికి కేన్సర్ వచ్చింది. చనిపోయే ముందు ఆయన శరీరం షేక్ అయ్యేది. అంటే మీరు ప్రారబ్దం అనుభవిస్తున్నారు కదా అని ప్రశ్న. శరీరానికి ఉన్న జబ్బును బట్టి అది అలా రియాక్టు అవుతోంది నాకు సంబంధం ఏమిటి

అన్నారు. నాకో దేహం ఉందని, దానికి రెండు చేతులు ఉన్నాయని, అందులో ఒక చేతికి ఏదో కురుపు ఉందని మీరు చెబుతూ ఉంటే నాకు తెలుస్తోంది అన్నారు. అది సుప్రీంస్టేట్.

శరణాగతి కుదిరిన వాడికి అసలు సంకల్పమే రాదు. మీకు ఉన్న శరణాగతి నిజమయితే మీకు దేహపరంగా కాని, వ్యక్తిపరంగాకాని అసలు సంకల్పం రాదు. తుకారామ్ ఏమని చెప్పాడంటే మనం ప్రయాణం చేసేటప్పుడు ఒకోసారి మన జేబులోనుండి పర్సు జారిపోతుంది. మనం ఇంటికి వెళ్ళి చూసుకొన్నాక అది ఎక్కడో పోయింది అని మనకు తెలుస్తుంది. అలాగే దేహగతమైన నేనులోనుండి విడుదల పొందాలి అనిగాని, దానికి ఫుడ్ కట్ చెయ్యాలి అనిగాని యిటువంటి తలంపులు నాకు ఎప్పుడూ రాలేదు. పాండురంగడి పట్ల ఉన్న భక్తిలో అదే పోయింది. భక్తిని ఎంతదూరం తీసుకొనివెళ్ళాలో అంతదూరం పాండురంగడి భక్తులు తీసుకొనిపోయారు. మనం అనుకొనే నేను తుకారామ్‌లోను కొంతకాలం ఉంది. తరువాత ఈ నేను కనిపించటం మానేసింది. నేను అనే తలంపు రావటంలేదు ఏమిటి అని ఆలోచిస్తే అది ఎప్పుడు పోయిందో నాకు తెలియదు కాని పోయింది. ఏదో విచారణ చేయటంవలన పోలేదు. పాండురంగడికి శరణాగతి చేయటం వలన, ఆ శరణాగతిప్రవాహంలో అది కొట్టుకొనిపోయింది కాని దానిని పోగొట్టుకోవాలని నేను ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. అది శరణాగతి మార్గం. ఇందులో వాడికి సొంత సంకల్పాలు అంటూ ఏమి ఉండవు. భగవంతుడు ఎక్కడ కూర్చోబెడితే అక్కడ, ఆయన సంకల్పమే భక్తుడి సంకల్పం, ఆయన ఇష్టమే వాడి ఇష్టం, అది శరణాగతి పొందిన వాడి లక్షణం. చివరకు నువ్వే ఉన్నావు, నేను లేను అనే స్థితికి వస్తాడు. అంటే శరణాగతి ప్రవాహంలో మిధ్యానేను కొట్టుకొని పోయింది.

భగవాన్ బయాగ్రఫీని మొదట ఇంగ్లీషులో వ్రాసినవాడు బి.వి. నరశింహస్వామి బయాగ్రఫీ వ్రాయటానికి, భగవాన్ జీవితంలోని సంఘటనలను సేకరించటానికి ఆయన చాలా కష్టపడ్డారు. భగవాన్‌ను అడిగినా ఒకోసారి చెప్పేవారుకాదు. ఆయన బంధువులద్వారా, స్నేహితులద్వారా కొన్ని సేకరించారు. భగవాన్‌కు 16వ సంవత్సరంలో మరణానుభవం కలిగింది. మరణానుభవం ద్వారా ఆయన మహర్షి అయ్యారు. స్పిరుట్యువల్ హిస్టరీలో పూర్వం ఏ సెయింట్‌కు ఇలా జరగలేదు. మరణానుభవం రాగానే నేను, నాది అనేవి రెండూ శేషం లేకుండా పోయాయి. మరణానుభవం ద్వారా ఆయన భయంలేని స్థితికి వెళ్ళిపోయారు, దేవతలకు కూడా అసూయ కలిగే సుప్రీమ్‌స్టేట్‌ను పొందారు. ఎందుచేతనంటే ఒకోసారి

అడిగినా భగవాన్ మౌనంగా ఉండేవారు. ఎందుచేతనంటే భగవాన్‌కు ఈ గొప్పలపట్ల, పొగడ్తలపట్ల ఏమీ అభిలాషలేదు. మరణానుభవం గురించి ఈ రోజున అందరికీ అందుతోంది అంటే ఆయన మొదట చాలా కష్టపడి భగవాన్ దగ్గరనుండి రాబట్టాడు. మరణానుభవం కలగటానికి ఎంత టైము పట్టింది అని నరశింహస్వామిగారు భగవాన్‌ను అడిగితే సత్యంలో కాలం లేదు. దేశకాలములు ట్రూత్‌లో లేవు అన్నారు.

కర్తలేని కర్మచెయ్యి అన్నారు భగవాన్. కర్తలేని కర్మఅంటే పని జరుగుతూ ఉండాలి, చేసేవాడు అక్కడ కనబడకూడదు. అలా పనిచేయటంవలన నీకు పవిత్రత కలుగుతుంది. అది నీకు రిలైజేషన్ పొందటానికి బాగా ఉపయోగపడుతుంది. గురువు పనిచెయ్యటం లేదు అని మనం అనుకొంటాము. ఆయన లోపల ఉండి పనిచేస్తున్నాడు. మీలో ఉన్న బలహీనతలను చూస్తూఉంటాడు. వాటిని ఎప్పుడు తొలగించాలి, ఎలా తొలగించాలి ఎక్కడ తొలగించాలి ఆ ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గ్రహించటానికి నీకు ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో గమనించి వాటిని ఒకోదానిని తొలగించుకొంటూ వస్తాడు. నీలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని నువ్వు చేరుకొనేవరకు, భగవదనుభవం నీకు కలిగేవరకూ నిన్ను నడిపిస్తాడు. ఆయన నీకు కనిపించడు, నీకు వినబడడు, కాని హృదయంలోనికి చేరుకొనే వరకు నిన్ను నడిపిస్తాడు, వాడే గురువు. మనలో ఏ వాసనలు ఉన్నాయో చూసుకొని ఏ టైములో ఏ వాసనను రిలీజ్ చెయ్యాలి, ఏ టైములో ఏ వాసనను తొలగించాలి అని టైము చూసుకొని ఆవాసనను నిశ్శేషముగా నశింపచేస్తాడు ఎందుచేతనంటే అదే పునర్జన్మను తీసుకొని వస్తుంది. నాకు పునర్జన్మఉందా అని ఒకరు బుద్ధుడిని అడిగారు. నీకు దేహం అవసరం అనుకొంటే వస్తుంది, అవసరంలేదు అనుకొంటే దేహంరాదు. దేహం అవసరం ఉందా, లేదా అని నువ్వే నిశ్చయించుకోవాలి. నీకు దేహం అవసరం అనుకొంటే అది వచ్చితీరుతుంది. దేహం అవసరం లేదు అని నీ అనుభవంలో ఉన్నప్పుడు ఇంక నీకు దేహంరాదు. అసలు మనిషికి భోగవాంఛ ఏమీలేదు అనుకోండి ఇంకవాడికి దేహంతో పనిఏముంది? భగవాన్ వ్రాసిన గ్రంథాలలో ఉన్నది నలుబది సద్విద్యలో ఎక్కువ పిండి ఉంది. ఉన్నది నలుబది సద్విద్యలో ఉన్నది ఏదో ఉన్నట్లు చెప్పాడు, దానిని చేరుకొనే మార్గం చెప్పాడు. ఉన్నది ఉన్నట్లు మనకు అర్థమైతే లేనిది లేనట్లు తెలుస్తుంది. ఉన్నది నలుబది సద్విద్య రిపీటెడ్‌గా చూడండి. దానిలో ట్రూత్ గురించి వివరంగా చెప్పారు. అదే నీవై ఉన్నావు అని, అక్కడకు ఎలా చేరుకోవాలి, దానిని ఎలా తెలుసుకోవాలి అనే దాని గురించి వివరించారు. అయితే ఉన్నది నలుబది

సద్విద్య అర్థం చేసుకోవటం కొంచెం కష్టంగా ఉంటుంది. మీరు కొంచెం కృషి చేస్తే సరిపోతుంది.

మనకు దుఃఖం వస్తూ ఉంటే, అశాంతి వస్తూ ఉంటే ఎక్కడో బంధం ఉన్నట్లు గుర్తు. అసలు పాపం అంటూ ఎక్కడ ఉంది? ఎటాచ్‌మెంటే పాపం. అంతకంటే పాపం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు అన్నారు భగవాన్. ద్వైతభావనలో నుండే భయం వస్తుంది. నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధితో చూస్తే భయం వస్తుంది. భగవాన్ దగ్గరకు పులులు వచ్చేవి, పాములు వచ్చేవి. అవి ఎంత దగ్గరకు వచ్చినా ఊరికే పోరా, పోరా అనేవారు. బ్రాహ్మీస్థితి పొందినవాడికి తనకంటే భిన్నంగా ఏదీ కనబడదు. భగవాన్ అప్పుడప్పుడు అరుణాచలం కొండవంక చూస్తూ ఉండేవారు. మీరు ఏమి చూస్తున్నారు, ఎవరిని చూస్తున్నారు అని అడిగితే గిరిని చూస్తున్నాను అని చెప్పలేదు, నన్ను నేనే చూసుకొంటున్నాను అనేవారు.

**కుట్ర అంతయు కోసి గుణముగ పాలించు**

**గురు రూపమై వెలుగు అరుణాచలా**

కుట్ర అంతయు కోసి అంటే నాలో ఉన్న దోషాలను తొలగించు. నాలో ఏ బలహీనతలు ఉన్నాయో నాకంటే నీకే బాగాతెలుసు. ఆ దోషాలను తొలగించి నన్ను గుణవంతుడిగా చెయ్యి. గురువు చెయ్యవలసిన పని అదే కదా. దోషాలు మనస్సులోనే ఉన్నాయి, గుణాలు మనస్సులోనే ఉన్నాయి, చైతన్యంలో రెండూ లేవు. అయితే గుణం ఎందుకు అంటే మనం మంచితనం పెంచుకుంటే మంచితనం రీలైజేషన్‌కు సహకరిస్తుంది. గుడ్‌నెస్ ఈజ్ నాలెడ్జ్ అని కొంతమంది అంటారు. కొంతమందిలో ఉన్న మంచితనం చూస్తూ ఉంటే ఏమిటి వీళ్ళు ఇంత మాధుర్యంగా ఉన్నారు, ఇంత తియ్యదనం ఎక్కడనుండి వచ్చింది వీళ్ళకు అని కొంతమంది భక్తులను చూస్తే మనకు అనిపిస్తుంది. అది ఎక్కడనుండి వచ్చిందో మనకు తెలియకపోయిన ఆ తియ్యదనం మన కళ్ళకు కనిపిస్తూ ఉంటుంది. ఆ మాధుర్యం కూడా ఈశ్వరుడు ఇచ్చిన ప్రసాదమే, అది గురువు అనుగ్రహమే. రామకృష్ణుడి దగ్గరకు ఎవడైనా సహృదయం ఉన్నవాడు వస్తే, కపటం ఎలా ఉంటుందో తెలియనివాడు వస్తే, తిరిగివాడు వెళ్ళిపోతూ ఉంటే కాసేపు కూర్చోమనేవారు. అంటే వాళ్ళ మంచితనాన్ని, వాళ్ళ గ్రేట్‌నెస్‌ను ఎంజాయ్‌చేసేవారు. కొంతమందికి అసలు కపటం ఎలా ఉంటుందో వారికి తెలియదు. అటువంటి వారిని భగవంతుడు వరిస్తాడు. రామకృష్ణుడు ఏమైనా పండితుడా, మరి ఆయన యూనివర్సల్ ఎలా అయ్యాడు అంటే అసలు ఆయనలో కపటం అనేది లేదు, అంతా ఓపెన్‌మైండ్.

లోపల బయట, లోపల బయట అని కొంతమంది ఎక్కువగా ఈ మాటలను ఉపయోగిస్తారు. ఇవి అన్నీ దేహబుద్ధిలో నుండి వస్తాయి. ఈ దేహం రాకముందు వీడు ఎక్కడ ఉన్నాడు, వీడు ఎక్కడ నుండి వచ్చాడు అని మనం ఆలోచించము. దేహం చనిపోయాక వీడు ఏ లోకానికి పోతాడు అని ఆలోచిస్తాము. ఈ ప్రశ్నలన్నీ దేహబుద్ధిలో నుండే వస్తున్నాయి. మనలో దేహబుద్ధి అంత బలీయంగా ఉంది. మీకు ఉన్న దేహబుద్ధి నశించి ఆత్మబుద్ధి కలగటానికి గురువు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. ఒకవేళ మీరు ఆయనను మరిచిపోయినా, గురువు మిమ్మల్ని మరిచిపోడు. మీరు సహజస్థితిని పొందేవరకు, 100% హేపీనెస్‌ను పొందేవరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మాకు జన్మలు ఉన్నాయా అని చాలామంది అడుగుతూ ఉంటారు. మీరు ఏదో రోజు చనిపోతారు కదా! ఆ చనిపోయే టైములో ఈ దేహంతోటి, ప్రపంచంతోటి, ప్రకృతితోటి, దేవతలతోటి సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మీరు సుఖంగా, ఆనందంగా ఉన్నారు అనుకోండి ఇంక మీకు పునర్జన్మ లేదు. మీలో ఏ రకమైన కొరత ఉన్నా పునర్జన్మ వచ్చితీరుతుంది. దీనికోసం ఇంక మీరు పుస్తకాలు చదవనక్కరలేదు. అనుగ్రహం అన్నా, గురువు అన్నా, భగవంతుడు అన్నా ఒక్కటే, ఈ మూడు పర్యాయపదాలు. అనుగ్రహం అనే మాటను మనం తేలికగా చదువుతున్నాము. నదికి వరద వచ్చినప్పుడు పెద్దపెద్ద చెట్లు ఎలా కొట్టుకొనిపోతాయో అలాగే గురువు అనుగ్రహం నిజంగా మీకు వచ్చినప్పుడు మీలో ఎన్ని బలహీనతలు ఉన్నా, ఎన్ని అలవాట్లు ఉన్నా ఆ అనుగ్రహప్రవాహంలో ఇవి అన్నీ కూడా కొట్టుకొనిపోతాయి. అనుగ్రహప్రవాహం అట్టిది.

ట్రూత్‌ను రీలైజ్ చేసినవారితో సాంగత్యం మంచిది. వారు మౌనంగానే పనిచేస్తారు. మౌనం వలన మానసిక సంపర్కం పెరుగుతుంది. నీకు ఏదైనా మంచిచేసినా, ఆధ్యాత్మికంగా నిన్ను ఉన్నతమైన స్థితికి తీసుకొని వెళుతున్నా కూడా అది ఇతరులకు తెలియాలి అని వారు అనుకోరు. మీలోపల ఉన్న వాసనలు తలంపురూపంలో రాకపోతే ఆవాసన ఉన్నట్లే మనకు తెలియదు. వాసనను తలంపు రూపంలో మీ సహస్రారంలోనికి తీసుకొనివచ్చి, అది ఉ ందని నీకు తెలియజేసి, దానిని పోగొట్టుకోవలసిన అవసరం ఉంది అనే బుద్ధిని నీకు కలుగజేస్తాడు. నోబుల్ తాట్స్, గుడ్ తాట్స్, మీరు బాగుపడే లక్షణాలు ఇవి అన్నీ కూడా హోలీ ప్రజెన్స్‌లో మీకు సమకూరుతాయి. గురువు అంటే అక్కడ శరీరంకాదు. గురువుయొక్క శరీరం చనిపోయినా ఆయనతో ఉన్న అనుబంధం కంటిన్యూ అవుతుంది. గురువు నీకు భౌతికంగా దగ్గరగా ఉన్నాడా, లేడా అన్నది ముఖ్యంకాదు. ఆయనతో మానసిక అనుబంధం

ముఖ్యం. గురువు అనుగ్రహంవలన వచ్చేశాంతి అభౌతికం, అలౌకికం. దానికి ఈ ప్రపంచానికి ఏమీ సంబంధం లేదని అనుభవంలోనికి తీసుకొనివస్తాడు. గురువు శరీరంలో ఉన్నప్పడు కూడా ఈ పని అంతా శరీరం చేయటం లేదు. ఏదైతే ఇదంతా చేస్తోందో అది శరీరం చనిపోయినా చేస్తూనే ఉంటుంది.

భగవాన్ అంటే నాకు ఇష్టమే. నేను ప్రయత్నం చేసి ఇష్టం తెచ్చుకోలేదు. ఆయన మీద నాకు ఉన్న ఇష్టానికి కూడా ఆయనే కారణం. ఆయన మీద నాకు ఉన్న ప్రేమకు కూడా ఆయనే కారణం. భగవాన్ చెప్పిన విషయం ఏమిటి అంటే మీ దేహాన్ని ప్రారబ్దానికి విడిచి పెట్టేయండి. హోలీ కంపెనీ వల్ల మీ మనస్సు కనుక అంతర్ముఖమైతే ప్రారబ్దం మిమ్మల్ని ఏమీ చేయదు. మీకు అశాంతిని తీసుకొనివచ్చే గొడవలు ఎన్ని ఉన్నప్పటికి, బయట ఎన్ని కష్టాలు ఉన్నప్పటికి మీ మనస్సు కనుక అంతర్ముఖమైతే బయట గొడవలు మిమ్మల్ని ఏమీ చేయలేవు. మీకు ఏదో పెద్దరోగం వస్తుంది. ఆరోగం తగ్గటానికి మందు మీ చేతిలో ఉంది. ఇంక మీరు ఆ రోగానికి బయపడటం ఎందుకు? ఆ రోగానికి బయపడవలసిన అవసరం లేదు.

మన జీవిత గమ్యం ఏమిటి అంటే ఈ జన్మ వచ్చినందుకు ప్రయోజనం ఏమిటి అంటే మీరు స్వరూపజ్ఞానం పొందాలి. ఈ శరీరం భూమి మీదకు వచ్చినందుకు నువ్వు పొందవలసింది అదే. మిమ్మల్ని పవిత్రులు చేయటానికి ఏది చెయ్యాలో, ఎప్పడు చెయ్యాలో అది గురువు చేస్తూనే ఉంటాడు. పులినోట్లో పడ్డ మాంసపు ముక్క బయటకు రాదు, ఎప్పటికైనా అది మింగేస్తుంది. మనందరం కూడా అటువంటివారమే. మీ అందరి శిరస్సు మీద ఈశ్వరానుగ్రహం ఉంది, ఈశ్వరానుగ్రహం లేకపోతే మీరు ఇక్కడకు రాలేరు. ఈశ్వరానుగ్రహమే మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చింది. నాలుగు రోజులు వెనుక, ముందు అవ్వవచ్చు గాని మీరందరు తప్పక తరిస్తారు, మీరందరూ స్వరూపజ్ఞానం పొందుతారు.

అయామ్ నేను ఉన్నాను. మీరు దేహంగా ఉండవద్దు, మనస్సుగా ఉండవద్దు. మీరు సహజంగా ఎలా ఉన్నారో అలా ఉండండి. మనకు మనస్సు ఉంది కాబట్టి ఎంతోకొంత ప్రయత్నం చేయకుండా ఉండలేము. అందుచేత మీరు చేయగలిగిందేదో చెయ్యండి. భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నీ శరీరం ఈ భూమిమీద తిరుగాడుతున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. యజ్ఞదానతపస్సులను కూడా మనం గుర్తు పెట్టుకోవాలి. అది మన సాధనలో ఒక భాగం. వీటి వలన మనం తొందరగా పవిత్రులమవుతాము, మన బుద్ధి పక్వానికి వస్తుంది. అందుచేత యజ్ఞదాన తపస్సులను మరచిపోకుండా మనం చేయగలిగింది ఏదో సైలెంట్‌గా చెయ్యాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రీ నాన్నగారు

జిన్నూరు శ్రీనాన్నగారు అంటే తెలియనివారుండరు. ఆబాలగోపాలానికీ ఆయన నాన్నగారే! శ్రీనాన్నగారు అంటే మనకళ్ళముందు కదలాడే వాత్సల్యం. భగవాన్ శ్రీరమణ మహర్షి పట్ల పరిపూర్ణభక్తి, శాంతి, దయాగుణం, ప్రేమతత్వం, ఇవన్నీ శ్రీనాన్నగారి సొత్తు. అట్టి నాన్నగారు అనేక సంవత్సరాలుగా తత్త్వబోధ చేస్తూ, స్వరూపజ్ఞానాన్ని సరళంగా అందిస్తూ, జిజ్ఞాసువులను తమ గమ్యంలోకి మేల్కొలుపుతూనే ఉన్నారు. నిగూఢ ఆధ్యాత్మిక విషయాలను, సూక్ష్మమైన ఆత్మతత్త్వాన్ని మధురంగా తగిన ఉదాహరణలతో భక్తుల హృదయాలకు హత్తుకునేలా బోధిస్తారు. సందర్భం వచ్చినప్పుడల్లా 'నేను' గురించి వివరిస్తారు. అనేక సంవత్సరములనుండి శ్రీనాన్నగారి దర్శనార్థం జిన్నూరు విచ్చేసే భక్తులు, అలాగే క్రొత్తగా వచ్చేవారు, ఎంతో ప్రశాంతతను పొందుతున్నారు. శ్రీనాన్నగారు తమను చూడవచ్చిన అందరి యొక్క చైతన్యస్థాయిని పెంచి, సందేహనివృత్తిగావించి, అంతర దృష్టిని కలిగించి, హృదయాభిముఖులను చేస్తారు. శ్రీనాన్నగారు భూమిపై నడియాడుతున్న ఈ కాలములో మనము కూడా వారితోపాటు జీవించి, సహచర్యం చేసి, ప్రత్యక్షంగా వారి బోధద్వారా అనుభవసారాన్ని అందుకోగలగడం గొప్ప అదృష్టం. శ్రీనాన్నగారితోటి నేటి మన సహచర్యం, భగవాన్ శ్రీరమణమహర్షి శరీరంతో ఉండగా అలనాటి భక్తులు వారితో గడిపిన కాలాన్ని మరియు మధుర స్మృతులను గుర్తుచేస్తుంది. తల్లి, తండ్రి, గురువు, ఈ ముగ్గురు చేసే పని మనపట్ల తానేచేస్తూ, ఆచరణ యోగ్యమైన సందేశమిస్తారు. రమణభాస్కర పత్రికద్వారా శ్రీనాన్నగారు అందించే తత్త్వజ్ఞానం సాధకులకు, జిజ్ఞాసువులకు ఒకవరప్రసాదం. ఆత్మజ్ఞానాన్ని వెదజల్లే రత్నాలు వారి అమృతవాక్కులు. నేటికాలంలో మన మధ్య అవతరించి, మనతో నడయాడుతూ, మనను గమ్యంవైపు నడిపిస్తూ, నిరంతరం జ్ఞానామృతాన్ని పంచుతూ, తాను ఆత్మగా భాసిస్తూ, అందరిని ఆత్మగా దర్శించే ప్రేమమూర్తి సద్గురు శ్రీనాన్నగారు. మనమందరము స్వరూప అమృతస్థితిని 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకొనుటద్వారా మాత్రమే గురు ఋణము తీర్చుకొనగలము.

**(దిii 23-09-2015 సద్గురు శ్రీనాన్నగారి జన్మదినం సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువు పట్ల ప్రీతి పెంచుకొంటే భయం పోతుంది

వినయం, స్వార్థం లేకుండా ఉండటం ఇవి మంచి శిష్యుని లక్షణాలు. ఇవి లేకపోతే గురువు ఆతనిపట్ల కోపంతో మండిపోతున్నట్లు పైకి కనబడతాడు కాని అంతరంగంలో సానుభూతి, వాత్సల్యం నిండుగా ఉంటాయి. ఇవి శిష్యుని సన్మార్గంలో నడపటానికే. గురువు తన కోపాన్ని కాఠిన్యాన్ని సహించే శక్తిని కూడా శిష్యునికి ఇస్తాడు. పైకి ఆయన గంభీరంగా కనబడినా అంతరంగంలో నిండా శిష్యునిపై అమృత వర్షం కురిపిస్తాడు. గురువు పొడి పొడి మాటలు చెప్పరు క్రియలో సత్తా చూపుతారు. పరోపకారం వారి వ్రతం. శిష్యునికి మనశ్శాంతిని ప్రసాదించటం వారి అభిమతం. వారి పాదాలను స్పృశించినా ధన్యుడు అవుతాడు. శ్రీ నాన్నగారు "గురువుయొక్క ఆగ్రహం కూడా అనుగ్రహమే" అన్నారు. గుర్జియేఫ్ తన అంతరంగ శిష్యునితో తిడతాడు అకారణంగా కొడతాడు. కఠినంగా అతన్ని బయటకు గెంటేస్తాడు. దానితో ఇతరులు ఆ శిష్యునితో అంతదారుణంగా వ్యవహరించిన పాదాలను పట్టుకొని వేళ్లాడుతావు ఏమిటి? అంటే "అది అంతా నా మంచికే" అంటాడు. గురువు అంటాడు "నన్ను గాఢంగా, గూఢంగా ప్రేమించి విశ్వసించే వారు మాత్రమే నన్ను అర్థం చేసుకోగలరు. వారి మనస్సును ప్రక్కన పెట్టటానికి సిద్ధంగా ఉన్నవారికి మాత్రమే నేను అర్థమౌతాను. అలాంటి స్థితిలో ఉన్న ఏదో ఒక శక్తి మీ హృదయాన్ని కదుపుతుంది. అవగాహనా విధానాన్ని ఆరంభిస్తుంది" అన్నారు. పాముకు చెవులు ఉండవు నాదస్వరం వల్ల సమ్మోహనానికి లోనౌతుంది. దాని శరీరంపై ఉన్న ప్రతీ అణువు మరియు చర్మం నుంచి వినగల్గుతుంది. అలాగే సత్సంగంలో గురుబోధను, ఒళ్ళు అంతా చెవులు చేసుకొని వినాలి. మన ఉనికి గురువు గారి నాడితో సరిసమానంగా స్పందిస్తుంది. అప్పడే అవగాహన కుదురుతుంది. మనం ఎక్కడ పడిపోతామో గురువు చెబుతారు. అవి అన్నీ అంతులేని రహస్యాలు వారిని అనుసరించి మనం ఆ దారిని నడవాలి. గురువు మన తప్పడు జ్ఞానాన్ని లాగివేయగలడు. ఆ దృష్టిలో ఆతడు స్మృతి పూర్వకంగా ఉండటాన్ని నేర్పగలడు. అదే మనకు పెద్ద సంపద. వారి ఆశీస్సులు మనలను స్పర్శించి జాగృతుణ్ణి చేస్తాయి. అది ఎలా ఉంటుంది అంటే కిటికీలోంచి మనపై పడే సూర్యకిరణాలు లాంటివాడు. ఆ వెలుతురు మన అజ్ఞాన నిద్రలోకిపోయే పరిస్థితిని రానియ్యదు. శిష్యరికం అనేది గురువుగా మారటానికి ఒక విధాన క్రమం. కాని శిష్యుడు గురువుగా మారుతున్నాను అనే ఆలోచన అహంకారమై దారి తప్పతాడు. వెయ్యినొక్క దుఃఖాలు అంటుకొంటాయి. మన హృదయాన్ని గట్టిగా తట్టిన వ్యక్తి మాత్రమే మనకు మరింత ముఖ్యమైపోతాడు. అప్పడు ఆయన కోసం సర్వస్వాన్ని ధారపోయగలము. గురువును శిష్యుడు గురువుగా అంగీకరించిన నాడే శిష్యుడు మానసికంగా మరణించటం ప్రారంభమౌతుంది. అప్పటినుంచి ఆతడు లేడు ఆతనిలో గురువు మాత్రం జీవిస్తాడు. అహంకారం యొక్క దుర్గంధాన్ని వదిలించుకోవటానికి గురు కరుణే మార్గము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966